ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

శుక్రవారం 14 జూన్ 2024







ముఖ్యమంత్రి చంద్రబాబుకు పూలతో స్వాగతం పలుకుతున్న రాజధాని గ్రామాల ప్రజలు

అమరావతి శిల్పికి.. అఖండ స్వాగతం

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతుల నీరాజనాలు
- హారతులు, పూలవర్షంతో రాజధాని మహిళల ఆహ్వానం
- పూలతో నిండిన సీడ్ యాక్సిస్, రాజధాని రహదారులు
- జై చంద్రబాబు.. జయహో అమరావతి.. అంటూ నినాదాలు





తుళ్లూరు/ గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నాడు పోలీసు పహారాలో కర్ఫ్యూ వాతావరణం.. పరదాలతో జగన్ కాన్వాయ్ సాగగా.. నేడవే రాజధాని రోడ్లు అమరావతి జయజయధ్వానాలతో, రైతులు.. మహిళలు నినాదాలతో హోరెత్తాయి. జయహో అమరావతి.. జై చంద్రబాబు అంటూ రాజధాని రైతులు, మహిళలు అమరావతి శిల్పి.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అఖండ స్వాగతం పలికారు. చంద్రబాబు కాన్వాయ్ వెళ్లే రాజధాని రహదారులపై టన్నుల కొద్దీ పూలతో నింపి పూలదారులుగా మార్చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో గురువారం సచివాలయంలో అడుగుపెట్టారు. ఉండవల్లిలోని నివాసం నుంచి బయలుదేరిన చంద్రబాబు కరకట్ట మీదగా వెంకటపాలెం, తాళ్లాయపాలెం, మందడం మీదగా వెలగపూడి సచివాలయానికి వచ్చారు. సచివాలయానికి చంద్రబాబు వస్తున్నారని అమరావతి రైతులకు గురువారం ఉదయమే తెలిసింది. దీంతో టన్నుల కొద్దీ బంతి, గులాబీ పూలు తెప్పించి రైతు శిబిరాల్లో వాటిని రాజధాని మహిళలు వలిచారు. అనంతరం ఆ పూలను మధ్యాహ్నం మూడు గంటల నుంచి వెంకటపాలెం సీడ్ రోడ్డు మొదలు సచివాలయం వరకు రోడ్డుపై పరిచి చంద్రబాబుకు అపూర్వ స్వాగతం పలికారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మని దర్శించుకుని సచివాలయానికి బయలుదేరిన చంద్రబాబు రాజధాని గ్రామాలకు చేరుకోవడానికి గంటకుపైగా ఆలస్యమైంది. అయినా మధ్యాహ్నం నుంచే వేలాది మంది రైతులు, మహిళలు రోడ్లపైకి వచ్చి చంద్రబాబు రాక కోసం ఎదురు చూశారు. చంద్రబాబు కాన్వాయ్ కరకట్ట రోడ్డులోంచి సీడ్ యాక్సిస్ రోడ్డులోకి ప్రవేశించగానే పూలవర్షం కురిపించారు. ముహూర్తం లోపు సచివాలయానికి వెళ్లాల్సి రావడంతో కాన్వాయ్‌ను ఒకింత వేగంగా వెళ్లేందుకు ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. వెంకటపాలెం, మందడం గ్రామాల మధ్య వందలాది మంది ప్రజలు రోడ్లపై నిలబడి చంద్రబాబు కాన్వాయ్‌కు అడ్డుపడ్డారు. జై చంద్రబాబు, జయహో అమరావతి.. బిల్డ్ అమరావతి.. సేవ్ ఆంధ్రప్రదేశ్ నినాదాలు చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాన్వాయ్‌కు అడ్డుపడి మరీ మహిళలు హారతులు ఇచ్చారు. దారి పొడవునా పూలవర్షం కురిపించారు. వెంకటపాలెం నుంచి మందడం వరకు వందలాది వాహనాలతో రైతులు కాన్వాయ్ వెంట ర్యాలీ తీశారు. దీంతో చాలా చోట్ల కాన్వాయ్ ఆగుతూ ముందుకు సాగాల్సిన పరిస్థితి వచ్చింది. ఏ ఒక్కరినీ నిరాశ పరచకుండా ఓపెన్ టాప్ కారులో నిలబడి అభివాదం చేస్తూ చంద్రబాబు ముందుకు సాగారు. తాడికొండ మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి రాజధాని మహిళలతో కలిసి సందడి చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్రానికి మంచి భవిషత్ వచ్చిందని టీడీపీ తుళ్లూరు మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు తెలిపారు.

న్యాయం గెలిచింది.. అధర్మం ఓడింది

అమరావతిని కాదని మూడు రాజధానులని ఐదు కోట్ల మంది తెలుగు ప్రజలను మోసం చేసిన మాజీ సీఎం జగన్‌రెడ్డి అధర్మం ఓడిందని రాజధాని మహిళలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజయంతో న్యాయం గెలిచిందన్నారు. మందడం సీడ్ రోడ్డు పక్కన న్యాయదేవత విగ్రహం పెట్టి మహిళలు పూజలు చేశారు. న్యాయం గెలిచింది అన్యాయం ఓడిందంటూ నినాదాలు చేశారు.

జగన్‌కు నిరసనలు.. చంద్రబాబుకు హారతులు

మూడు రాజధానుల పేరుతో అమరావతిని చిదిమేయాలని చూసిన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కాన్వాయ్ రైతుల నిరసనలు ఎదుర్కోగా, నేడు చంద్రబాబు కాన్వాయ్ పూలవర్షంలో తడిసి పోయింది. జగన్ సచివాలయానికి వెళ్లే సమయంలో రాజధాని మొత్తం కర్ఫ్యూ వాతావరణం నెలకొనగా నేడదే గ్రామాల్లో వేలాది మంది రోడ్లమీదకు వచ్చి సంబరాలు చేసుకున్నారు. జగన్‌రెడ్డి సచివాలయానికి వెళ్లే సమయంలో రాజధాని గ్రామాలన్నీ పోలీసు పహారాలో ఉంటే.. నేడు రైతుల మాన వహారాలతో నిండిపోయాయి. నాడు జగన్ కాన్వాయ్ పరదాల మధ్య సాగగా నేడు అవే రోడ్లు పూలదారులై చంద్రబాబుకు స్వాగతం పలికాయి.



సచివాలయం వద్ద...


ప్రాజెక్టులకు.. పునరుజ్జీవం

- టీడీపీకి మళ్లీ అధికారంతో రైతుల్లో ఆశలు
- వైసీపీ పాలనలో పడకేసిన సాగునీటి రంగం
- టీడీపీ ప్రారంభించిన వాటిని పాడుబెట్టిన వైనం
- కూటమికి అధికారంతో పనులు ప్రారంభమౌతాయని భావన

గోదావరి - పెన్నా నదుల అనుసంధానం.. గుంటూరు ఛానల్ పొడిగింపు.. ఆధునికీకరణ.. నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ.. బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు.. వరికపూడిశెల ఎత్తిపోతల పథకం.. ఇలా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలు తీర్చే ప్రాజెక్టులపై వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా నిర్లక్ష్యం వహించింది. సాగునీరు లేక లక్షల ఎకరాలు బీళ్లుగా మారినా.. తాగునీరు లేక ప్రజలు అల్లాడినా పాలకులు ఆలకించలేదు. టీడీపీ హయాంలో శంకుస్థాపనలు జరిగాయి.. మేమెందుకు వాటిని చేయాలన్న ధోరణితోనే ముఖ్యమంత్రి జగన్ పాలన సాగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జరిగిన సభల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి జగన్ పేరుకు ఆయా ప్రాజెక్టులపై ప్రస్తావించారే కాని పనులు ప్రారంభానికి అవసరమైన నిధులు విడుదలను మరిచారు. వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి సీఎం జగన్ ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేశారే కానీ పనులు ప్రారంభంపై ఆలోచన చేయలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి అధికారంలోకి రావడంతో ఆయా ప్రాజెక్టుల పునరుజ్జీవంపై రైతులు, ప్రజలు ఆశగా ఉన్నారు.

(నరసరావుపేట, గుంటూరు - ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో జగన్‌రెడ్డి పాలనలో అభివృద్ధికి పట్టిన గ్రహణం వీడింది. అభివృద్ధిపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 2019కి ముందు టీడీపీ హయాం లో చేపట్టి నిలిచిన సాగు, తాగునీటి ప్రాజెక్టుల్లో కదలిక రానుంది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో నిలిచిపోయిన నీటి పారుదల ప్రాజెక్టుల పనులు తిరిగి ప్రారంభం అవుతాయని రైతులు కోటి ఆశలతో ఉన్నారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం.. వరికపూడిశెల ప్రాజెక్టుల పూర్తికి చంద్రబాబు తొలి ప్రాధాన్యం ఇస్తారని రైతులు ఆశిస్తున్నారు. 2014 నుంచి 19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. కేవలం ఏడాది వ్యవధిలోనే అప్పట్లో రికార్డు సమయంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి గోదావరి మిగులు జలాలను కృష్ణా డెల్టాకు తరలించింది. దాంతో రైతులు సకాలంలో పంటల సాగు చేపట్టగలిగారు. ఏటా జూన్‌లోనే పట్టిసీమ ద్వారా నీరు కృష్ణా డెల్టా కాలవల్లో ప్రవహించేది. అప్పట్లో దిగుబడి కూడా అధికంగా వచ్చేది. ఆ ప్రాజెక్టుని చంద్రబాబు నిర్మించారన్న అక్కసుతో వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ రెండు, మూడేళ్ల పాటు పట్టిసీమ ఎత్తిపోతల పంపులనే ఆన్ చేయనివ్వలేదు. గత ఏడాది తీవ్ర నీటికొరత ఏర్పడటంతో దిక్కులేని స్థితిలో పట్టిసీమ ద్వారా కొంతనీటిని డెల్టాకు తరలించారు. టీడీపీ హయాంలో 70శాతం పైగా పూర్తి అయిన పోలవరం ప్రాజెక్టుని పూర్తిచేసి ఉంటే ఈ పాటికే గ్రావిటీపై గోదావరి జలాలను డెల్టాకు తీసుకురావడం సాధ్యమయ్యేది. అయితే ఆ ప్రాజెక్టు ఏజెన్సీని మార్చుచేసి రివర్స్ టెండరింగ్ అంటూ మోసం చేసి దానిని కూడా ఎప్పటికి పూర్తి అవుతుందో చెప్పలేని స్థితిలోకి తీసుకెళ్లింది. వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తెచ్చినా వైసీపీ ప్రభుత్వం పనులు చేపట్టడానికి నిధులు విడుదల చేయలేదు. ఈ పనులన్నింటిని పూర్తిచేస్తామని ఇప్పటికే చంద్రబాబు హామీ ఇచ్చారు. దీంతో సాధ్యమైనంత త్వరగా ఆయా పనులు ప్రారంభం కావాలని రైతులు కోరుకుంటున్నారు.



అమరావతి మండలంలోని లింగాపురంలో పంపుహౌస్ నిర్మాణం కోసం జరిగిన మట్టి పని

పేరు మార్చి పాడుబెట్టారు


గోదావరి-పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజీ ఎగువన ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి 2018 సెప్టెంబరు 5న టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో 9,61,231 ఎకరాలకు సాగునీరు, 679 చెరువులకు తాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించిన చంద్రబాబు ప్రభుత్వం రూ.6,020.15 కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు కోసం తొలి విడతలో ప్రభుత్వ భూములను జలవనరులశాఖకు స్వాధీనం చేశారు. ప్రైవేటు భూమి అవసరమైన చోట భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేశారు. ప్యాకేజీ 1 కింద పంపుహౌస్ల నిర్మాణానికి లింగాపురంలో 5,32,000 క్యూబిక్ మీటర్లు, క్రోసూరులో 5,77,496 క్యూబిక్ మీటర్ల మట్టిపనిని పూర్తి చేశారు. నీటి పంపింగ్‌కు పైపులను అమర్చే పనిని చేపట్టారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. భూసేకరణ చేపట్టలేదు. చేసిన పనులకు సంబంధించి ప్యాకేజీ 1లో రూ.201.96 కోట్లు, ప్యాకేజీ 2లో రూ.208.52 కోట్లు చెల్లించాల్సి ఉంది. చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టు సంస్థలు ఎక్కడిపనులు అక్కడ నిలిపేసి యంత్రసామగ్రిని కూడా తరలించేశాయి. ఈ ప్రాజెక్టు పేరును వైఎస్ఆర్ పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ ప్రాజెక్టుగా మార్చడంలో జగన్ సర్కారు చూపిన శ్రద్ధ, నిధులు కేటాయించడంలో చూపలేదు. మళ్లీ చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో గోదావరి జలాలు సాగర్‌కు తరలించే ఈ పథకంపై రైతుల్లో ఆశలు చిగురించాయి.



గుంటూరు చానల్

అనుమతుల్లోనే ఆధునికీకరణ


గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, పొడిగింపు గురించే ఐదేళ్ల పాలనలో జగన్ మరిచారు. తొలుత ఛానల్‌లో 0 నుంచి 47వ కిలోమీటర్ వరకు ఆధునికీకరణ చేపట్టాలని నిర్ణయించారు. 0 కిలోమీటర్ వద్ద 750 క్యూసెక్కుల డిశ్చార్జి, 47వ కిలోమీటర్ వద్ద 350 క్యూసెక్కుల డిశ్చార్జి ఉండేలా డిజైన్స్ కూడా ఆమోదం పొందాయి. ఇందుకోసం రూ.378.258 కోట్లకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసి బడ్జెట్‌లో కూడా పొందుపరిచింది. అలానే గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం మరో రూ.280 కోట్లను మంజూరు చేసి ప్రత్తిపాడు, పెదనందిపాడు, పర్చూరు మండలాల్లో సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. నల్లమడ డ్రెయిన్ ఆధునికకీరణకు కూడా అప్పట్లో పరిపాలన అనుమతులు వచ్చాయి. తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయినందున గుంటూరు ఛానల్ ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తారని రైతులు ఆశిస్తున్నారు.



బుగ్గవాగు

అటకెక్కిన వరికపూడిశెల

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో వరికపూడిశెల ఎత్తిపోతల పథకాన్ని అటకెక్కించింది. ఎన్నికల ముందు నిధులు విడుదల చేయకుండానే హడావుడిగా ఈ ప్రాజెక్టుకు జగన్ శంకుస్థాపన చేశారు. వరికపూడిశెల నిర్మాణం వైసీపీ పాలనలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎత్తిపోతల నిర్మాణానికి అటవీ, వన్యప్రాణి సంరక్షణ శాఖల నుంచి అనుమతులు వచ్చాయే కాని పనుల ప్రారంభానికి వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా మాటలతో పబ్బంగడిపింది. ఈ ప్రాజెక్టు మొదటి దశలో వెల్దుర్తి మండలంలోని 24,900 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడం లక్ష్యంగా డిజైన్ చేశారు. రెండో దశలో దుర్గి, బొల్లాపల్లి మండలాల్లో మరో 47,876 ఎకరాలు సాగునీరు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మొత్తం 72,776 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ఆయా ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలు పరిష్కారం అవుతాయి. తొలి దశలో పనులకు రూ.340.26 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎలాంటి నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. ఈ పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు ఈ ఏడాదిలోనే వరికపూడిశెల తొలి దశ పనులు పూర్తి చేస్తారని ఆ ప్రాంతవాసులు విశ్వసిస్తున్నారు.



వరికపూడిశెల ఎత్తిపోతల నిర్మించే ప్రదేశం

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తా
- కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని బాధ్యతల స్వీకరణ



కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'ప్రజా సంక్షేమమే లక్ష్యం. వారి అంచనాలకు తగినవిధంగా పనిచేస్తాను. ప్రజా సమస్యలను పరిష్కరించే ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదిలిపెట్టను..' అని కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఢిల్లీలోని సంచార్‌భవన్‌లో కమ్యూనికేషన్స్‌శాఖ సహాయమంత్రిగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. తొలుత పెమ్మసానికి సంబంధిత అధికారులు ఆత్మీయంగా ఆహ్వానించారు. బాధ్యత స్వీకరణ అనంతరం కార్యాలయ, శాఖాపరమైన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే క్రమంలో అందరి సహకారం ఉండాలని అధికారులకు సూచించారు. మన మేథస్సును రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఉపయోగించాలని తెలిపారు. తనను నమ్మి ఇంతటి బాధ్యతను అప్పగించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిభావంతులైన జ్యోతిరాధిత్య సింధియా, శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో కలిసి పనిచేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఇనుమ డింప చేసేలా తన పనితీరు ఉంటుం దని ఆయన చెప్పారు.

47 ఏళ్ళ తర్వాత అవకాశం

గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందిన ఎంపీకి 47 ఏళ్ల తర్వాత కేంద్ర మంత్రివర్గంలో చోటు లభించింది. గతంలో ఇక్కడి నుంచి ఐదు సార్లు గెలుపొందిన కొత్త రఘురామయ్య 1957నుంచి 1977వరకు కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. ఆయన ఎంపీగా 1952లో తెనాలి లోక్‌సభ స్థానం నుంచి గెలుపొంది పార్లమెంటులోకి అడుగు పెట్టారు. ఆ తర్వాత 1957లో గుంటూరు నుంచి రెండోసారి విజయం సాధించి నెహ్రూ కేబినెట్‌లో రక్షణశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత కార్మిక, పౌర సరఫరాల శాఖలను కూడా చేపట్టి 1964 వరకు మంత్రిగా ఉన్నారు. లాల్‌బహదూర్‌శాస్త్రి కేబినెట్‌లో 1964 -66 వరకు పౌరసరఫరాలు, సాంకేతిక శాఖల మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ప్రధాని ఇందిర కేబినెట్‌లో 1966-77 వరకు న్యాయ, పెట్రోలియం, పార్లమెంటరీ వ్యవహారాలు, నౌక రవాణా, పర్యాటకశాఖల మంత్రిగా వ్యవహరించారు. రెండు దశాబ్దాలు కేంద్రంలో మంత్రిగా ఉండి చరిత్ర సృష్టించిన రఘురామయ్య 1979లో మరణించారు.

మనోహర్‌కు ఘన స్వాగతం



ఎన్డీఏ కూటమిలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారిగా తెనాలి వచ్చిన నాదెండ్ల మనోహర్‌కు కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు.

మెగా డీఎస్సీతో.. వెయ్యికిపైగా పోస్టులు

ఉమ్మడి గుంటూరు జిల్లా నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో హర్షం

గుంటూరు(విద్య), జూన్ 13: డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం తొలిసంతకం చేయడంతో ఉత్తర్వులు జారీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీంతో ఉమ్మడి జిల్లాలో నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో హర్షాతిరేకం వ్యక్తం అవుతోంది. మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు వెయ్యికిపైగా పోస్టులు వచ్చే అవకాశం ఉందని సీనియర్ ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇందులో ఎస్‌జీటీలు 520, స్కూల్ అసిస్టెంట్స్, టీజీటీ, పీజీటీ ప్రిన్సిపాల్ పోస్టులు మరో 500పైగా ఉంటాయని అంచనా. జీవో 117 రద్దు చేస్తే పోస్టులు పెరుగుతాయని చెపుతున్నారు. ఉపాధ్యాయ పోస్టుల కోసం ఏళ్ల తరబడి నిరుద్యోగ ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే అనేక మంది డీఈడీ, బీఈడీ పూర్తి చేసి శిక్షణ కూడా తీసుకున్నారు. గత ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందు డీఎస్సీని ప్రకటించగా ఎన్నికల కమిషన్ నిలిపివేసింది. అనేక పాఠశాలల్లో ఖాళీగా పోస్టులు న్నా కనీసం విద్యా వలంటీర్లగా నిరుద్యోగ ఉపాధ్యాయులకు అవకాశం లేకుండా చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీ వారిలో కొత్త ఉత్సాహం తెచ్చింది. తాజా అది కార్యరూపం దాల్చడంలో నిరుద్యోగ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్‌ఏఎఫ్‌ఏయూ)- ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఎఫ్‌ఏడీఈఈ) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్‌ఏ), బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీ.డిజైన్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.



కోర్సులు-సీట్లు: బీఎఫ్‌ఏ కోర్సులో అయిదు స్పెషలైజేషన్లు ఉన్నాయి. రెగ్యులర్ కేటగిరీలో అప్లయిడ్ ఆర్ట్ 35, పెయింటింగ్ 20, స్కల్ప్చర్ 10, ఫొటోగ్రఫీ 30 సీట్లు ఉన్నాయి. ఎస్‌ఎస్‌ఎస్ కేటగిరీలో అప్లయిడ్ ఆర్ట్ 15, పెయింటింగ్ 15, స్కల్ప్చర్ 10, యానిమేషన్ 60, ఫొటోగ్రఫీ 20 సీట్లు ఉన్నాయి.

- బీ.డిజైన్ కోర్సులో ఇంటీరియర్ డిజైన్ స్పెషలైజేషన్ ఉంది. ఇందులో ఎస్‌ఎస్‌ఎస్ కేటగిరీ కింద 60 సీట్లు ఉన్నాయి.

ఎఫ్‌ఏడీఈఈ వివరాలు: ఎగ్జామ్‌లో భాగంగా ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్ పేపర్లు ఉంటాయి. బీఎఫ్‌ఏ(అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్, యానిమేషన్) ప్రోగ్రామ్‌లకు ఎ, బి, సి పేపర్లు; బీఎఫ్‌ఏ(ఫొటోగ్రఫీ) ప్రోగ్రామ్‌కు డి, ఇ పేపర్లు; బీ డిజైన్(ఇంటీరియర్ డిజైన్) ప్రోగ్రామ్‌నకు ఎఫ్ పేపర్ రాయాల్సి ఉంటుంది.

- ఎ-పేపర్‌లో మెమొరీ డ్రాయింగ్ అండ్ కలరింగ్ ఎగ్జామ్ ఉంటుంది. దీనికి 100 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం గంటన్నర
- బి-పేపర్‌లో ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం 50 నిమిషాలు
- సి-పేపర్‌లో ఆబ్జెక్ట్ డ్రాయింగ్ ఎగ్జామ్ ఉంటుంది. దీనికి 100 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం గంటన్నర
- డి-పేపర్‌లో 100 మార్కులకు కంపోజిషన్ అండ్ విజువల్ కమ్యూనికేషన్ ఎగ్జామ్ ఉంటుంది. పరీక్ష సమయం గంటన్నర
- ఇ-పేపర్‌లో 50 మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం 50 నిమిషాలు
- ఎఫ్-పేపర్‌లో 200 మార్కులకు డిజైన్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం మూడు గంటలు.
- ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 35 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 4
- **హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్:** పరీక్షకి నాలుగు రోజుల ముందు
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎఫ్‌ఏడీఈఈ తేదీలు:** బీఎఫ్‌ఏ(ఫొటోగ్రఫీ), బీ.డిజైన్(ఇంటీరియర్ డిజైన్) ప్రోగ్రామ్‌లకు జూలై 20; బీఎఫ్‌ఏ(అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్, యానిమేషన్) ప్రోగ్రామ్‌లకు జూలై 21
- **వెబ్‌సైట్:** www.jnafauadmissions.com, www.jnafau.ac.in

తెలంగాణ డీఈఈ సెట్ నోటిఫికేషన్

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్య విభాగం - డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీ డీఈఈ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్‌ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్‌ఈ) కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలు సహా ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, మైనారిటీ, నాన్ మైనారిటీ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రతి ప్రైవేట్ కళాశాలలో 80 శాతం 'ఎ' కేటగిరీ సీట్లు, 20 శాతం 'బి' కేటగిరీ సీట్లు ఉంటాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లతోపాటు 'ఎ' కేటగిరీ సీట్లను సింగిల్ విండో సిస్టమ్ ద్వారా 'బి' కేటగిరీ సీట్లను కళాశాలల యాజమాన్యం నిర్ణయం మేరకు భర్తీ చేస్తారు. 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. అభ్యర్థుల వయసు 2024 సెప్టెంబరు 1 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

టీజీ డీఈఈ సెట్ వివరాలు: డీఈఈ సెట్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. డీఈఎల్‌ఈడీ ప్రోగ్రామ్ ఈ మూడు మాధ్యమాల్లో అందుబాటులో ఉంది. అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్ కోసం ఎంచుకొన్న మాధ్యమంలోనే డీఈఈ సెట్ రాయాల్సి ఉంటుంది. డీపీఎస్‌ఈ ప్రోగ్రామ్ ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఉంటుంది. ఇందులో చేరాలనుకొనేవారు డీఈఈ సెట్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలోనే రాయాలి. ఆంగ్ల మాధ్యమంలో డీఈఈ సెట్ రాస్తే రెండు ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి అవకాశం ఉంటుంది.

- డీఈఈ సెట్‌ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం వంద ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ అండ్ టీచింగ్ ఆప్టిట్యూడ్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. రెండో పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్ నుంచి 10, జనరల్ తెలుగు(తెలుగు మాధ్యమం అభ్యర్థులకు)/జనరల్ ఉర్దూ (ఉర్దూ మాధ్యమం అభ్యర్థులకు) నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో ఎగ్జామ్ రాసేవారికి జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 ప్రశ్నలు, జనరల్ తెలుగు/జనరల్ ఉర్దూ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. మూడో పార్ట్‌లో మేథమెటిక్స్ నుంచి 20, ఫిజికల్ సైన్సెస్ నుంచి 10, బయలాజికల్ సైన్సెస్ నుంచి 10, సోషల్ స్టడీస్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. రెండో పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్, జనరల్ తెలుగు/జనరల్ ఉర్దూ ప్రశ్నలను ఆ భాషల్లోనే ఇస్తారు. మిగిలిన రెండు పార్ట్‌లలో అన్ని ప్రశ్నలనూ అభ్యర్థులు ఎంచుకొన్న మాధ్యమంలో ఇస్తారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** deecet.cdse.telangana.gov.in/

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రశ్నలు
'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/BJhswiqలో
చదవండి.

ముందుగానే దేవర రాక



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దేవర'. గురువారం చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రంలో తొలి భాగం 'దేవర: పార్ట్ 1'ను అక్టోబర్ 10న విడుదల చేస్తున్నట్లు గతంలో చిత్రబృందం ప్రకటించింది. అయితే ఇప్పుడు విడుదల తేదీ ముందుకు మారింది. సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు గురువారం తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ఎన్టీఆర్ మాస్ లుక్‌లో కనిపించారు. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, నరైన్ కీలకపాత్రలు పోషించారు. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



'జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం'

ప్రేమ కథల్లో ఎక్కువగా నటించే సుధీర్‌బాబు.. రూటు మార్చి నటించిన కంప్లీట్ యాక్షన్ ప్యాక్డ్ చిత్రం 'హరోం హర'. ఈ చిత్రానికి జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించగా, సుమంత్.జి.నాయుడు నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరో సుధీర్‌బాబు మీడియాతో ముచ్చటించారు. "హరోంహర' సరికొత్తగా చేసిన కమర్షియల్ సినిమా. ప్రేక్షకులకు ఈ కథా నేపథ్యం, మాటలు, సన్నివేశాలు కొత్త ప్రపంచాన్ని చూసిన అనుభూతిని ఇస్తాయి. నా దృష్టిలో కమర్షియల్ సినిమాల్లో కథ హీరో నుంచి మొదలైతేనే బాగుంటుంది. ఈ సినిమాను 'జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం' అనొచ్చు. ఇందులో నేను పోషించిన సుబ్రమణ్యం పాత్ర అన్ని వర్గాల ప్రేక్షకులకి నచ్చుతుంది. ఇప్పటివరకూ తెలుగులో వచ్చిన పది ఉత్తమ యాక్షన్ చిత్రాల్లో 'హరోం హర' ఒకటిగా మిగిలిపోతుందనే నమ్మకం ఉంది. హీరోయిన్ మాళవిక శర్మ తన పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయింది" అని చెప్పారు.

ఈ ప్రశంసలు ఊహించలేదు



వంశీ జొన్నలగడ్డ దర్శకత్వంలో నూతన నటీనటులతో రూపొందిన చిత్రం 'నీ దారే నీ కథ'. ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మశాల, వేద్, అంజన బాలాజీ ప్రధాన పాత్రల్లో నటించారు. వంశీ జొన్నలగడ్డ, తేజేష్ వీర, శైలజ జొన్నలగడ్డ నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీమియర్ షో ఏర్పాటు చేశారు. ఈ షో ముగిశాక డైరెక్టర్ వంశీ మాట్లాడుతూ "సంగీతంలో అనుకున్నది సాధించడం కోసం నలుగురు యువకులు చేసే ప్రయత్నాల్ని అందర్నీ ఆకట్టుకునేలా, ఎంతో ఆసక్తికరంగా చూపించారని.. ప్రీమియర్‌లో సినిమాను చూసిన ప్రేక్షకులందరూ ప్రశంసిస్తున్నందుకు ఆనందంగా ఉంది. అందరూ సినిమాను ఇంతగా ఆదరిస్తారని అస్సలు ఊహించలేదు. థియేటర్లలోనూ ప్రేక్షకులు ఇదే విధంగా సినిమాను ఆదరిస్తారని కోరుకుంటున్నాను" అని అన్నారు.



బాలల పోరాటం

చిత్తజల్లు ప్రసాద్ దర్శకత్వంలో కేపీ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'బాలతేజం'. దిలీప్ రాథోడ్, ఇరిగే రమేష్, హీరోయిన్‌లుగా అరవింద, షన్ను, చెన్నకేశవ నాయుడు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గురువారం ఈ సినిమా షూటింగ్ కూకట్‌పల్లి-ఆల్విన్ కాలనీలో ప్రారంభమైంది. డ్రగ్స్ సరఫరా చేసి యువతను నిర్వీర్యం చేస్తున్న ముఠాపై బాలలు చేసిన పోరాటమే ప్రధాన ఇతివృత్తంగా సినిమా ఉంటుందని డైరెక్టర్ చిత్తజల్లు ప్రసాద్ తెలిపారు.

రేవ్‌పార్టీ కేసులో నటి హేమకు బెయిల్



బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో అరెస్ట్ అయి జైలు జీవితం గడుపుతున్న నటి హేమకు ఊరట లభించింది. బుధవారం ఆమెకు బెయిల్ లభించింది. రేవ్ పార్టీలో డ్రగ్స్ వాడకంపై బెంగళూరు ఎన్‌డీపీఎస్ కోర్టులో విచారణ జరిగింది. 'హేమ డ్రగ్స్ వాడినట్లు పోలీసులు ఎలాంటి సాక్ష్యాలు న్యాయస్థానానికి సమర్పించలేదు' అని ఆమె తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. హేమపై ఆరోపణలు వచ్చిన పది రోజుల తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించారని, ఆమెకు నెగెటివ్ వచ్చిందని, ఆమె వద్ద ఎలాంటి డ్రగ్స్ లభించలేదు అని న్యాయవాది కోర్టుకు నివేదించారు. సీసీబీ (బెంగళూరు నేర నియంత్రణ దళం) న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ, 'హేమ మరికొంత మంది టాలీవుడ్ సినీ ప్రముఖులను ఈ పార్టీకి తరలించే ప్రయత్నం చేశారు, నోటీసులు పంపినా అనారోగ్య కారణాలను సాకుగా చూపి విచారణకు హాజరుకాలేదు, అందువల్లే ఆమెను అరెస్ట్ చేయాల్సి వచ్చింది' అని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి హేమకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఆమె ఏ క్షణంలోనైనా విడుదలయ్యే అవకాశాలున్నాయి. అరెస్ట్ తర్వాత తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ హేమ సభ్యత్వాన్ని రద్దు చేసింది.

అందాల రాక్సీ వచ్చింది



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలుగా నటిస్తున్నారు. గురువారం దిశా పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమె రాక్సీ అనే పాత్ర పోషిస్తున్నట్లు తెలిపింది. ట్రైలర్‌లో పోరాట ఘట్టాల్లో మెరిసిన దిశా ఈ పోస్టర్‌లో సైతం పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XvNanAq లో చదవండి.

చిత్తశుద్ధిలో చంద్రబాబుకు ఎవ్వరూ సాటి లేరు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, జూన్ 13: చెప్పింది చేసే చిత్తశుద్ధి, పేదల కష్టాలను పట్టించు కోవటంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎవ్వరూ సాటి లేరని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ అన్నమాట ప్రకారం ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే మెగా డీఎస్సీ, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు దస్త్రాలపై సంతకం చేయటమే అందుకు నిదర్శనం అన్నారు. వాటితో పాటు పింఛన్‌ల పెంపు, అన్న క్యాటీల పునరుద్ధరణ, నైపుణ్య గణన దస్త్రాలపై సంతకాలతో ఐదు సంవత్సరాల తన పాలన, పేదల సంక్షేమం, యువతరం సాధికారితకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వనున్నారని స్పష్టమైన సంకేతాలు ఇచ్చారన్నారు. డీఎస్సీ ఆశావహుల కష్టాలు, కన్నీళ్ళను దగ్గరగా చూసిన వ్యక్తిగా చంద్రబాబు 16వేలకు పైగా పోస్టులను మెగా డీఎస్సీని విడుదల చేయటంతో నిరుద్యోగుల్లో ఒక పండుగ వాతావరరణం నెలకొందన్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుతో ప్రజల్లో తమ భూములు, ఆస్తులు భద్రం అనే భావన కలిగించారన్నారు. అన్నింటికి మించి పెన్షన్ల పెంపుతో అవ్వాతాతలు, వికలాంగులకు పెద్ద కొడుకుగా కొండంత అండగా నిలిచారన్నారు. అన్నా క్యాంటీన్‌ల పునరుద్ధరణ ద్వారా పేదల ఆకలి తీర్చే మంచి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించి చంద్రబాబు అందరి మన్ననలు పొందారన్నారు.

మంత్రివర్గంలో బీసీలకు సముచిత ప్రాధాన్యం

● రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి అర్బన్, జూన్ 13: రాష్ట్ర మంత్రివర్గంలో బీసీలకు అత్యంత ప్రాధాన్యం కల్పించారని రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. గురువారం తెనాలిలో విలేకర్లతో మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా విధ్వంసానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రంలో అణగారిన బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వ అరాచక పాలన కారణంగానే ఎన్‌డీఏ కూటమిని ప్రజలు గెలిపించారని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యవస్థలను ప్రక్షాళం చేయాలని ముఖ్యంగా పోలీసు వ్యవస్థపై మరింత దృష్టి పెట్టాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ పట్ల శ్రద్ధ చూపితే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్నారు.

నామినేటెడ్ ఛైర్మన్‌లు.. రాజీనామాలకు ససేమిరా

● తమకు పదవీకాలం ఉందంటూ వాదన

● ప్రభుత్వానికి నివేదించాలని అధికారుల నిర్ణయం

గుంటూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవులు పొందిన వారిలో కొంతమంది తోక జాడిస్తున్నారు. ఆ పార్టీ ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలైన దృష్ట్యా గౌరవంగా వారే తప్పుకోవాల్సి ఉంది. అయితే జిల్లాలో కొంతమంది నామినేటెడ్ ఛైర్మన్లు రాజీనామా పత్రాలను సమర్పించడం లేదు. ఇప్పటికే సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు గవర్నమెంట్ నిర్ణయాన్ని తెలియజేసినా మాకు వచ్చే నెల వరకు సమయం ఉంది. అప్పటివరకు రాజీనామాలు చేయబోమంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు వారి వ్యవహార శైలిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. దీంతో త్వరలోనే ఆయా ఛైర్మన్‌లను తొలగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వ పరిపాలన కొనసాగిన సందర్భంలో జిల్లాలోని పలు వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ఆర్‌బీకేలు, సలహా మండళ్లు, గ్రంథాలయ, దేవాలయాలు, వివిధ కార్పొరేషన్లకు నామినేటెడ్ విధానంలో ఛైర్మన్‌లు/ ఛైర్‌పర్సన్‌లు నియమితులయ్యారు. జిల్లాలో కీలకమైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి నిమ్మకాయల రాజనారాయణ గత ఏడాది జూలైలో నియామకం పొందారు. ఏడాదిపాటు ఆయన పదవీకాలం. దాని ప్రకారం జూలై 18తో ముగుస్తుంది. అయితే వైసీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలైన దృష్ట్యా నైతికంగా నామినేటెడ్ పదవుల్లో ఆయా నేతలు కొనసాగరు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం నాలుగురోజుల క్రితం వారితోనే రాజీనామాలు చేయించాలని ఆదేశాలు జారీచేసింది. ఆ మేరకు ప్రభుత్వ నిర్ణయాన్ని అధికారులు నామినేటెడ్ పదవులు అనుభవిస్తున్న వారికి తెలిపారు. అయితే తమకు వచ్చే నెల వరకు పదవీకాలం ఉందని, అప్పటి వరకు రాజీనామాలు చేయబోమని సమాధానాలు ఇస్తున్నారు.

ఈ విధమైన పరిస్థితి గుంటూరు ఏఎంసీతో పాటు తాడికొండ ఏఎంసీలోనూ ఉంది. తాడికొండ ఏఎంసీ ఛైర్మన్ పూర్ణచంద్రరావు ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో చేరినప్పటికీ ఆయన నియామకం వైసీపీహయాంలో జరిగినందున రాజీనామా చేయాలని అధికారులు కోరుతున్నారు. అందుకు ఆయన ససేమిరా అంటున్నారు. ఇదేరీతిన జిల్లా వ్యవసాయ సలహా మండలి, రైతు భరోసా కేంద్రాలు, దేవాలయాలు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ, శాలివాహన, పూసల కార్పొరేషన్ ఛైర్మన్‌లు కూడా ఇంకా రాజీనామాలు చేయలేదు. కాగా సంబంధిత అధికారులు వారందరిని రాజీనామా పత్రాలు ఇవ్వాలని కోరుతున్నప్పటికీ వారు నాన్చుతుండటంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు నిర్ణయించారు.

పుడా ఛైర్మన్ రమేష్ రాజీనామా ఆమోదం

నరసరావుపేట: పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథిరిటీ ఛైర్మన్ మిట్టపల్లి రమేష్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన రాజీనామాను ఆమోదిస్తూ గురువారం మునిసిపల్ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మునిసిపల్ పరిపాలన విభాగం కార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులను విడుదల చేశారు.

మొక్కు తీర్చుకున్న ఇప్పటం గ్రామస్థులు



మొక్కులు తీర్చుకుంటున్న గ్రామస్థులు, జనసేన నేతలు

తాడేపల్లి, జూన్ 13: తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామంలో జనసేన నేతలు, కార్యకర్తలు, పవన్ అభిమానులు పలువురు గ్రామస్తులు స్థానిక రామాయంలో 1001 కొబ్బరికాయలు కొట్టి గురువారం మొక్కులు తీర్చుకున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భారీ మెజారిటీతో గెలవాలని కోరుకుని అనంతరం పవన్ విజయంతో ఈ మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస యాదవ్, జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, మంగళగిరి ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పవన్ ఆనాడు సభ పెడతానంటే రైతులు స్థలం ఇచ్చారని, కానీ జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి రోడ్డు వెడల్పు పేరిట పలువురు రైతుల ఇళ్ళు, నిర్మాణాలు కూలగొట్టిందని, ప్రజలు జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. రాష్ట్రం ఇక ప్రగతిపథంలో పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, రాంబాబు, జనసేన నేతలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఎస్‌ఆర్‌ఎం కులపతి



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పారివేందర్, సత్యనారాయణన్

మంగళగిరి, జూన్13: ఏపీ ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయం వ్యవస్థాపక కులపతి, మాజీ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ టీఆర్ పారివేందర్, వర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ పీ.సత్యనారాయణన్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడునుఉండవల్లిలోని నివాసంలో కలుసుకున్నారు. చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేస్తుందని, ప్రజల సంక్షేమానికి ప్రణాళికాబద్ధమైన పాలన అందించాలని పారివేందర్ ఆకాంక్షించారు. అమరావతిలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని సత్యనారాయణన్ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధితోపాటు అమరావతి పునర్నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని, ఎస్‌ఆర్‌ఎం వర్సిటీకి ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీ తొలిగించిన వైసీపీ నేతలు

● గ్రామంలో ఉద్రిక్తత

బాపట్లరూరల్, జూన్ 13: బాపట్ల మండలం పాండురంగాపురం గ్రామంలోని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నక్కా వీరారెడ్డి కొంతమంది వైసీపీ కార్యకర్తలను వెంటబెట్టుకొని బుధవారం రాత్రి ఫ్లెక్సీని తొలిగించారు. ఆ ప్రదేశానికి వెళ్ళి ఎందుకు తొలిగిస్తున్నావు అని టీడీపీ నాయకలుఉ ప్రశ్నించగా ఈ ఊరులో ఏ ఫ్లెక్సీని పెట్టటానికి వీలులేదంటూ నక్కా వీరారెడ్డి గొడవకు పాల్పడ్డాడు. దీంతో ఇరుపార్టీల మధ్య కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సామాజిక మాధ్యమాల్లో వైసీపీ నాయకులు చేసిన విధ్వంసాన్ని బాపట్ల రూరల్ పోలీసులు చూచి వెంటనే పాండురంగాపురం గ్రామానికి చేరుకున్నారు. గొడవకు కారణమైన ఐదుగురు వైసీపీ నాయకులను బాపట్ల రూరల్ సీఐ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వటం జరిగిందని తెలిపారు. అదేవిధగా గ్రామంలో బీఎస్ఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి గ్రామంలో పికెట్‌ను ఏర్పాటు చేశారు.

అరసవెల్లికి కాలినడకన చంద్రబాబు అభిమాని



అరసవెల్లికి కాలినడకన బయలుదేరి వెళ్తున్న మారాసు సుబ్బారావు

పెదనందిపాడు, జూన్ 13: సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేస్తే శ్రీకాకుళం జిల్లా అరసవెల్లి శ్రీసూర్యనారాయణస్వామి దేవస్థానానికి కాలినడకన వస్తానని మండలంలోని నాగులపాడుకు చెందిన టీడీపీ కార్యకర్త మారాసు సుబ్బారావు మొక్కుకున్నారు. గురువారం నాగులపాడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అరసవెల్లికి కాలినడకన బయలుదేరి వెళ్ళారు. మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ పాదయాత్రను ప్రారంభించారు.

పశ్చిమ గోదావరిపై ప్రకాశం జయభేరి



ఎం.అక్షిత (4 వికెట్లు)

మంగళగిరి సిటీ, జూన్ 13: ఏసీఏ సెంట్రల్ జోన్ సీనియర్ మహిళల అంతర్ జిల్లాల వన్డే టోర్నీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో పశ్చిమ గోదావరి జిల్లాపై ప్రకాశం జిల్లా జట్టు 76 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రకాశం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. టీ.మల్లిక 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 108 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. పశ్చిమ గోదావరి బౌలర్లు రిషిక కృష్ణన్, మానసశ్రీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమ గోదావరి జట్టు 40.2 ఓవర్లలో కేవలం 149 పరుగులు మాత్రమే చేసి ఆలౌటయింది. ప్రకాశం బౌలర్ ఎం.అక్షిత పది ఓవర్లలో 32 పరుగులిచ్చి 4 వికెట్లు సాధించింది.



టీ.మల్లిక (108 పరుగులు)

డేటాసైన్స్‌లో విస్తృత పరిశోధనలు చేయాలి

● ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆచార్య జీపీ రాజశేఖర్

గుంటూరు(విద్య), జూన్ 13: విద్యార్థులందరూ డైటాసైన్స్‌పై విస్తృత పరిశోధనలు చేయాలని ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లయిడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ మేథమ్యాటిక్స్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్ అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను హైబ్రిడ్ మోడ్‌లో (ఆన్‌లైన్ అండ్ ఆఫ్‌లైన్) గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ మేథమ్యాటిక్స్, స్టాటిస్టిక్స్‌లో ప్రావీణ్యం పొందిన విద్యార్థులు భవిష్యత్‌లో డేటాసైన్స్‌ను పరిశోధనాంశంగా ఎంచుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ సమాచారం ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుందని, విద్యార్థులు నిరంతర ప్రక్రియగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నబిల్ మలైకీ, ఫెసర్ జుల్కర్‌మైన్ నబిర్ విద్యార్థులకు న్యూమరల్ నెట్ వర్క్ సిస్టమ్‌లోని మెళుకువలను వివరించారు. డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, పాల్గొన్నారు.



కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామికి గురువారం మహా న్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి గజ పూలమాలలతో ప్రత్యేక అలంకారం చేశారు.

- నరసరావుపేట

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	147, 156,167
చికెన్ విత్ స్కిన్	284.00
చికెన్ స్కిన్ లెస్	294.00

ప్రజా ప్రభుత్వంతో అన్నివర్గాలకు మేలు

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జూన్13: రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనకు తెరదించి చంద్రబాబునాయుడు నాయకత్వంలో జూన్ 12 ప్రజా ప్రభుత్వం ఏర్పాటయిందని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో మొదటిదైన మెగా డీఎస్సీపై తొలి సంతకం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై 2వ సంతకం, పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతూ 3వ సంతకం, అన్నా క్యాంటీన్‌ల పునరుద్ధరణపై 4వ సంతకం, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణపై 5వ సంతకం చేసి ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదేనని యరపతినేని అన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాలు హర్షించేలా పాలన కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. యువత ఉద్యోగాలకు డీఎస్సీ, వైసీపీ ప్రభుత్వం అడ్డదారిలో జీవో ఇచ్చిన ప్రజల ఆస్తులను కాజేసే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయ డంతో పాటు కోట్లాది మంది ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్‌ల పునరుద్ధరణ చేయడం సంతోషదాయకమన్నారు. రాష్ట్రంలో కోట్లాది మంది పింఛన్‌దారులకు తీపి కబురుగా చెప్పిన 4 వేల పింఛన్ పెంపును అమలు చేస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న నాదెండ్ల మనోహర్

మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఘనస్వాగతం

తెనాలి రూరల్, జూన్ 13: మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి తొలిగా తెనాలి వచ్చిన నాదెండ్ల మనోహర్‌కు కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మండలంలోని నందివెలుగు కూడలి వద్ద గురువారం సాయంత్రం కూటమి ఆధ్వర్యంలో ఆయనకు భారీ ర్యాలీగా తెనాలి జనసేన పార్టీ కార్యాలయానికి తీసుకువచ్చారు. దారిపొడవునా మనోహర్‌కు మహిళలు దిష్టితీసి హారతులు పడుతూ ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటారు. మండలంలోని సోమసుందరపాలెం, కంచర్లపాలెం, రజకచెరువు రోడ్డు, ఐతానగర్‌లో పలువురు కూటమి శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆయనకు భారీ స్వాగతం పలికారు.



వెంకటపాలెం తిరుపతికి పాదయాత్రగా బయలు దేరిన రాజధాని రైతులు

వెంకన్న సన్నిధికి రాజధాని రైతులు

● కూటమి గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావటంతో..

తుళ్లూరు, జూన్ 13: చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటంతో, రైతులు తొమ్మిది మంది గురువారం తిరుమల తిరుపతికి పాదయాత్రగా బయలు దేరారు. వెంకటపాలెం టీడీటీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో పూజలు చేశారు. అమరావతి రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు పాద యాత్రను ప్రారంభింపజేశారు. పువ్వాడ వెంకటేశ్వరావు, జొన్నలగడ్డ భాస్కరరావు, ఆలపాటి బాలయ్య, ముప్పవరపు వెంకటేశ్వరావు, అబ్బూరి శ్రీనివాసరావు, చెరెడ్డి జనార్ధన్, వెల్లంకి కృష్ణమోహన్, కసుమర్తి రంగారావు పాదయాత్రగా వెళుతున్నారు. కాగా మరో మూడు రోజుల్లో రాజధాని మహిళలు 108 మంది తిరుపతి వెళ్ళి మొక్కు తీర్చుకోవటానికి టీడీపీ రాజధాని నేత ఉప్పలపాటి(బెంగళూరు) సాంబశివరావు ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

గుంటూరు(విద్య),జూన్ 13: జిల్లాలోని ఎంపిక చేసిన 20 పాఠశాలల్లోని 70 మంది ఉపాధ్యాయులకు, 20 మంది ప్రధానోపాధ్యాయులకు, నలుగురు ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ అధ్యాపకులకు గురువారం చంద్రమౌళి నగర్‌లోని భాష్యం స్కూల్లో కెరీర్ ఎడ్యుకేషన్ గైడెన్స్‌పై శిక్షణను నిర్వహించారు. గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసు, రాక్వెల్ ప్రాప్‌టీచర్స్‌కు శిక్షణ ఇచ్చారు. గుంటూరు జిల్లా డీఈవో పీ.శైలజ, సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలల్లో ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో పీవీవెంకటేశ్వరరావు రిసోర్సు పర్సన్లు ప్రసాద్, జయశంకర్, మంజునాథ, అనూష తదితరులు పాల్గొన్నారు.

39,659 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 39,445 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 39,659 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,394 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	18000	334	8000	14500
నెంబరు. 5	10500	16500	నెంబరు. 5	16800	16800
273	14000	15000	273	--	--
341	8000	17000	341	9000	16500
4884	--	--	4884	8800	16000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	19700	తేజ	9000	19500
బ్యాడిగి	8000	17700	బ్యాడిగి	8000	17500
దేవనూరు డీలక్స్	8000	15500	దేవనూరు డీలక్స్	16000	16000
తెల్లకాయలు	5000	11000	తెల్లకాయలు	5000	13000

ELECTION NOTIFICATION

No.	Item		Details
1.	Name of the Bank		The Guntur Co- Operative Urban Bank Ltd., Guntur, 3/2, Brodipet, Guntur
2.	Date of Election		07-07-2024
3.	No. of Members to be elected to the Managing Committee		2 (Two) Only
4.	The area / constituency from which the members to be elected		General
5.	Term of the members of the Managing Committee		2 Directors - Term - 5 years from – 07.08.2024 to 06.08.2029 (as per Section 21(3) of APMACS Act 1995)
6.	Qualifications if any specified in Bye-Laws for eligibility for Membership of the Managing Committee		1. Shall have been a voting member of the Bank for at least two years immediately preceding the year of election. 2. Shall have attended the two general body meetings of the Bank held immediately preceding the elections. 3. Shall not possess any disqualifications as specified in the Bye-Laws No.21 of the Bank and APMACS Act, 1995
7.	Receipt of Nominations	Date	25-06-2024 (Tuesday)
		Place	The Guntur Co.op. Urban Bank Ltd., Administrative Office, 3rd Floor, 3/2, Brodipet, Guntur
		Time	09.00 AM to 01.00 PM
8.	Publication of list of Nominations received	Date	25-06-2024 (Tuesday)
		Place	Notice Board of The Guntur Co. op. Urban Bank Ltd., Administrative Office, 3rd Floor, 3/2, Brodipet, Guntur
		Time	After 02.00 PM
9.	Scrutiny of Nominations	Date	26.06.2024 (Wednesday)
		Place	The Guntur Co. op. Urban Bank Ltd., Administrative Office, 3rd Floor, 3/2, Brodipet, Guntur
		Time	09.00 AM to 11.00 AM
10.	Publication of list of valid nominations	Date	26.06.2024 (Wednesday)
		Place	Notice Board of The Guntur Co. op. Urban Bank Ltd.,Administrative Office, 3rd Floor, 3/2, Brodipet, Guntur
		Time	After 12.00 Noon
11.	Withdrawal of Nominations	Date	27.06.2024 (Thursday)
		Place	The Guntur Co. op. Urban Bank Ltd., Administrative Office, 3rd Floor, 3/2, Brodipet, Guntur
		Time	09.00 AM to 12.00 Noon
12.	Publication of final list of valid nominations and allotment of symbols.	Date	27.06.2024 (Thursday)
		Place	Notice Board of The Guntur Co.op. Urban Bank Ltd., Administrative Office, 3rd Floor, 3/2, Brodipet, Guntur
		Time	After 01.00 PM
13.	Date, Time and place of Poll	Date	07.07.2024 (Sunday)
		Place	Naveena School, 4th Line, Panduranga Nagar, Amaravathi Road, Guntur
		Time	07.00 AM to12.00 Noon
14.	Counting of Votes	Date	07.07.2024 (Sunday)
		Place	Naveena School, 4th Line, Panduranga Nagar, Amaravathi Road, Guntur
		Time	From 02.00 P.M. onwards
15.	Declaration of Result		Immediately after counting on 07-07-2024 (Sunday).

Place : GUNTUR
Date : 13-06-2024

(VEMULA PRASAD) Election Officer, The Guntur Co- Operative Urban Bank Ltd., 3/2, Brodipet, Guntur – 522 002. (Regd. Under AP Mutually Aided Co. op. Societies Act, 1995, Reg.No.431)

Note : 1) Nomination fee of Rs.10,000/- (Rupees Ten Thousand Only) to be paid by each candidate at the time of filing the nomination. 2) Candidates contesting in the election should not possess any disqualification as mentioned in the AP Mutually Aided Co. operative Societies Act, 1995 and also as per the bye-laws of the Bank. 3) Voters List is available with Election Officer. 4) Voters List is displayed in the Notice Board of the Bank at Administrative Office, 3rd Floor, 3/2, Brodipet,Guntur.
Note: 1) Voter has to bring any approved ID card viz., Adhaar card or PAN Card or Membership ID card issued by the bank for exercising vote.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు


ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కూటమి నేతలు, కార్యకర్తలు

ఎమ్మెల్యే జూలకంటికి శుభాకాంక్షలు

మాచర్లటౌన్, జూన్ 13: సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందిన మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మారెడ్డికి మాచర్ల నియోజకవర్గం నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. గుంటూరులోని బ్రహ్మారెడ్డి నివాసానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కూటమి నేతలు, కార్యకర్తలు చేరు కుంటున్నారు. బ్రహ్మారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్నారు. గురువారం మాచర్ల పట్టణానికి చెందిన టీడీపీ సెల్ సీనియర్ నాయకుడు మాచర్ల వాసుతోపాటు మాజీ కౌన్సిల్ శ్రీహరి, బీమవరపు శ్రీనివాసరావు, జక్రి తదితరులు గుంటూరు చేరుకొని బ్రహ్మారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

15న మాచర్లకు ఎమ్మెల్యే జూలకంటి .. స్వాగత ఏర్పాట్లలో నేతలు

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా భారీవిజయం సాధించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి శనివారం మాచర్ల నియోజకవర్గంనకు రానున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మొదటిసారిగా బ్రహ్మారెడ్డి నియోజకవర్గంలో అడుగుపెట్టనున్నారు. తమ అభిమాన నేతకు స్వాగతం పలికేందుకు కూటమి నేతలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు బ్రహ్మారెడ్డి కారంపూడి మండలం పేటసన్నిగండ్లకు చేరుకుంటారు. అక్కడ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం దుర్గి మండలం మీదుగా మాచర్ల పట్టణానికి చేరుకొని అక్కడి నుంచి వెల్దుర్తి మండలానికి వెళ్లనున్నారు.


మేరికపూడిలో మొక్కుబడి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

మొక్కుబడిలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూన్ 13 : ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు సత్తెనపల్లి నియోజకవర్గంలో కన్నా లక్ష్మీనారాయణ విజయం సాధించాలని, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాలని ఫిరంగిపురం మండలం మేరికపూడిలో మస్తాన్‌వలి బాబా దర్గా దగ్గర మొక్కుకున్నారు. అనంతరం టీడీపీ అధికారంలోకి రావటం, కన్నా లక్ష్మీనారాయణ ఎమ్మెల్యే కావటంతో మాదల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం దర్గావద్ద మొక్కులు చెల్లించుకున్నారు. మొక్కుల కార్యక్రమంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ముప్పాళ్ళ మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

శిశు మరణాల నివారణకు కృషి చేయాలి

● టాస్క్‌పోర్స్ గణాంక అధికారి నీలకంఠేశ్వరరావు

గురజాలటౌన్, జూన్ 13: వైద్యశాలలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ మాతా శిశు మరణాల నివారణకు కృషి చేయాలని టాస్క్‌పోర్స్ బృందంలోని జిల్లా గణాంక అధికారి నీలకంఠేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని పల్లెగుంతలో వైద్య ఉప కేంద్రాన్ని ఆయనతోపాటు డీపీవో నూరుబాషా, డీపీహెచ్‌ఎన్‌వో సురేఖ సందర్శించారు. వారు మాట్లాడుతూ కిశోర బాలికలు, గర్భిణులు రక్తహీనతతో మరణించకూడదన్నారు. వైద్య సిబ్బంది సకాలంలో వైద్యం అందించి రక్తహీనత లేకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రత నెలకొనేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రికార్డులను పరిశీలించారు. పల్లెగుంత, పాత అంబాపురం గ్రామాల్లోని గర్భిణీల గృహాలకు వెళ్లి అందుతున్న వైద్య సదుపాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్, పీహెచ్‌వో రాణి, సూపర్‌వైజర్లు అల్లం వాసు, కరిమున్నీసా, ఎంఎల్‌హెచ్‌పి దివ్య, ఏఎన్‌ఎం విమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుతో వృద్ధుల మోముల్లో ఆనందం

రెంటచింతల,జూన్ 13: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబునాయుడు సామాజిక పింఛన్లను రూ.1000 పెంచుతూ సంతకం చేయడంతో ఆ వర్గాల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. ఎన్నికల ముందు చంద్రబాబు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చారని ప్రశంసలు కురిపిస్తున్నారు.. మండలంలోని 11 గ్రామాల్లో వివిధ రకాల పింఛన్లు పొందే వారి సంఖ్య 7143గా ఉంది. ప్రతి నెల వీరికి రూ.2 కోట్ల 14 లక్షల 29 వేలు చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఈ మొత్తానికి అదనంగా రూ. 71 లక్షల 43 వేలు అదనంగా ఇవ్వబోతున్నారు. ఇప్పటి నుంచి ప్రతి నెల పింఛన్ రూ.4 వేలు అందనుంది.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు

సత్తెనపల్లి, జూన్ 13 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మెగా డీఎస్సీ పై మొదటి సంతకం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలుగుయువత రాష్ట్ర అధికారప్రతినిధి వక్కంటి అజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఐదు సంవత్సరాల్లో ఒక్క డీఎస్సీని జగన్ ప్రకటించ లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామి మేరకు 16,347 పోస్టుల భర్తీకి మొదటి సంతకం చేయటం అభినందనీయమన్నారు. అలాగే ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుచేసి ప్రజల మనోభావాలను చంద్రబాబు గౌరవించారన్నారు. అన్నక్యాంటీన్‌ల పునరుద్ధరణ, పింఛన్ల పెంపు, స్కిల్ సెన్సెస్‌పై చంద్రబాబు నాయుడు మొదటి ప్రాధాన్యంగా సంతకాలు చేసినందుకు కృతజ్ఞతలు తెలి పారు.

వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చుంటే

రాజధాని లేని రాష్ట్రంగా మిగిలేది

సత్తెనపల్లి, జూన్ 13 : రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వస్తే రాజధాని లేని రాష్ట్రంగా మిగిలేదని కాంగ్రెస్‌పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి చుక్కా చంద్రపాల్ అన్నారు. గురువారం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న చంద్రపాల్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఇండియా కూటమికి పలుప్రాంతాల్లో మద్దతు తెలిపారన్నారు. దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పరోక్షంగా మద్దతు పలకటం, రాహుల్‌గాంధీకి అండగా నిలబడటం జరిగిందన్నారు. మోడీ నియంతృత్వ పాలనకు ప్రజలు అడ్డుకట్ట వేశారన్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో దేశంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ కేంద్రంలో పాగావేయటం ఖాయమన్నారు. సమావేశంలో నేతలు మాదంశెట్టి వేదాద్రి, చాంద్ బాషా, హాజీమ్, కోట ఆనంద్, ఎం శంకర్, కొత్త లక్ష్మయ్య, జే శేఖర్, మీసాల శంకర్, అమీర్ పాల్గొన్నారు.

క్రోసూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ రాజీనామా

క్రోసూరు, జూన్ 13 : క్రోసూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ ఈదా సాంబిరెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు మార్కెట్‌యార్డు కార్యదర్శికి తన రాజీనామా పత్రాన్ని అందజేసినట్టు తెలియ జేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందినందుకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈదా సాంబిరెడ్డి రాజీనామాను ఉన్నతాధికారులకు పంపనున్నట్టు కార్యదర్శి ఈశ్వరరావు తెలియ జేశారు.



నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు శ్రీకృష్ణ దేవరాయలు వరుసగా రెండో సారి ఎంపీగా గెలుపొందడంతో టీడీపీ మాచర్ల సీనియర్ నేత, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు గురువారం నరసరావుపేటలో శ్రీకృష్ణదేవరాయలును కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. యాగంటి వెంట బొట్టు కోటేశ్వరరావు, మస్తాన్ ఉన్నారు. - **మాచర్ల రూరల్**

అధికార పీఠంపై అధినేత

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మెగా డీఎస్సీ ఫైల్‌పై తన తొలి సంతకాన్ని చేశారు. అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సెస్‌పై సంతకాలు చేశారు. దీంతో జిల్లాలోని ప్రజలతో పాటు కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో సంబరాలు నిర్వహించారు. పలువురు ఆలయాలకు పాదయాత్రగా వెళ్లి పూజలు నిర్వహించి వారి మొక్కులను చెల్లించుకున్నారు.

- ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతల స్వీకారంతో నేతల సంబరాలు
- ఐదు హామీలపై సంతకాలతో ప్రజల్లో హర్షం
- వివిధ ప్రాంతాల్లో కూటమి శ్రేణుల విజయోత్సవ ర్యాలీలు
- ఆలయాలకు పాదయాత్రలు.. మొక్కుబడుల చెల్లింపులు


పాదయాత్ర చేపట్టిన దుర్గి కూటమి నేతలు, కార్యకర్తలు

బెల్లంకొండ,జూన్13: బెల్లంకొండ మండలంలోని మాచాయపాలెం గ్రామంలో గురువారం టీడీపీ సీనియర్ నేత గుడిసె కొండయ్య ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా భాష్యం ప్రవీణ్ గెలుపొందిన సందర్భంగా ఈ విజయోత్సవర్యాలీ నిర్వహించారు. మాచాయపాలెం మెయిన్‌రోడ్డు నుంచి బాణాసంచాలతో, డప్పు వాయిద్యాలతో టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి ర్యాలీలో పాల్గొని విజయవంతం చేశారు. టీడీపీ సీనియర్ నేత గుడిసె కొండయ్య మాట్లాడుతూ భాష్యం ప్రవీణ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందటంపై సంతోషం వ్యక్తంచేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బంగారయ్య, రోశయ్య, చెన్నయ్య, పూర్ణయ్య పాల్గొన్నారు. అదే విధంగా నాగిరెడ్డిపాలెం గ్రామంలో వెన్నా సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో చంద్రాజుపాలెంగ్రామంలో ఓర్సు ఆనంద్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు ఆధ్వర్యంలో విజయో త్సవ ర్యాలీ నిర్వహించారు.

అచ్చంపేట: మండలంలోని తాడువాయి గ్రామంలో గురువారం టీడీపీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తాడువాయి లోను, బంగారు తండా, సంద్ర తండాల్లోనూ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ర్యాలీలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పల్లెలపాటి శ్రీనివాస రావు, మూడావత్ బాలూ నాయక్, ఏపూరి రమేష్, అనుమోలు


అచ్చంపేట తాడువాయిలో టీడీపీ నేతల విజయోత్సవ సంబరాలు

వెంకటేశ్వరరావు, శాఖమూరి బాజీ, కోపూరి ఆంద్రియ, ఎక్కిరాల డేవిడ్‌రాజు, మందా చిన్నప్ప, భూక్యా లూకానాయక్, మల్లాడి పోసియా, కమతం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దుర్గి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు పదవీ బాధ్యతలు చేపట్టడం, మాచర్ల నియోజకవర్గం నుంచి జూలకంటి బ్రహ్మారెడ్డి అఖండ మెజార్టీతో గెలుపొందడంతో మండల పరిధిలోని ఆత్మకూరుకు చెందిన కూటమి నేతలు గురువారం గ్రామం నుంచి అడిగొప్పులలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయం వరకు పాదయాత్ర సాగించారు. అనంతరం ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఓబులేశునిపల్లెలో సుమారు 1000 మంది అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. దుర్గిలో జనసేన నేతలు డీజే చప్పుళ్లతో గ్రామ పురవీధుల్లో భారీ విజయోత్సవ ర్యాలీ జరిపారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర బీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తినేని పుల్లయ్య, కేశం రవి, దేవగట్టు బ్రహ్మయ్య, కేశం ప్రసాద్, మందా నాగేశ్వరరావు, బృంగా రాజు, నాగయ్య, తోట హనుమంతురావు, ఉన్నం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గురజాలటౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నాలుగోసారి బాధ్యతలు చేపట్టడం, యరపతినేని శ్రీనివాసరావు గురజాల నుంచి భారీ మెజార్టీతో గెలుపొందడంతో గురువారం కూటమి నేతలు అంకాళమ్మ ఆలయంలో పూజలు జరిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని మాడుగులలో కూటమి నేతలు భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పదో వార్డు కౌన్సిలర్ నేలవల్లి బొల్లయ్య, మాజీ సర్పంచ్ గడిపూడి చెన్నయ్య, జక్కా దుర్గ, లొట్టపల్లి రమణ, నాగేంద్రబాబు, యాగంటి రామారావు, చావా రామారావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని, గురజాలలో యరపతినేని శ్రీనివాసరావు అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని కోరుతూ కరాలపాడుకు చెందిన బుర్రి


రెంటచింతలలో టీడీపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు

నరసింహారెడ్డి తన మొక్కు చెల్లించుకున్నాడు. గురువారం కరాలపాడు లో టీడీపీ నేతలు నరసింహారెడ్డి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు మట్టపల్లి నరసింహస్వామి దేవాలయం వరకు పాదయాత్ర కొనసాగించి అనంతరం తలనీలాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నాడు. కార్యక్రమంలో మద్దసాని మంగిరెడ్డి, యలమందారెడ్డి, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, వెంకటరెడ్డి, నర్సిరెడ్డి, డాక్టర్ శంకర్ పాల్గొన్నారు.

రెంటచింతల: రెంటచింతల పరిధిలోని ఆంజనేయస్వామి మాన్యం, అంబేద్కర్ కాలనీ, పాతగడ్డలో టీడీపీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు చిందులు వేశారు. బాణాసంచా మోతతో గ్రామం దద్దరిల్లింది.


కేశానుపల్లిలో ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

దాచేపల్లి: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించడం, గురజాల ఎమ్మెల్యేగా యరపతినేని శ్రీనివాసరావు భారీ మెజార్టీతో గెలవడంతో కేశానుపల్లిలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అన్నివర్గాల ప్రజలు బాణసంచా కాలుస్తూ కనకతప్పట్లతో పూలవర్షం కురిపిస్తూ గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ యూత్ నాయకులు నెల్లూరి రామకోటయ్య, మాజీ ఎంపిటిసి నెల్లూరి కోటయ్య, షేక్ జానయ్య, గ్రామ సర్పంచ్ సుందరరావు, లింగయ్య, నెల్లూరి రామారావు, పాల్గొన్నారు.


మట్టపల్లి నరసింహస్వామి ఆలయం వద్దకు కరాలపాడు టీడీపీ నేతల పాదయాత్ర..

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూన్ 13: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్ళాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అంగన్ వాడీ కార్యకర్తలకు సూచించారు. టీడీపీ ప్రజా వేదికలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్లు, ఐసీడీఎస్ ఉద్యోగులు కన్నా లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ తన గెలుపులో నియోజకవర్గంలోని మహిళల పాత్ర కూడా ఎంతో ఉందన్నారు. మహిళా సంక్షేమానికి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కన్నా తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమినేని వందనాదేవి,గోర్రెపాటి సుశీల, తోట అంబిక, మారుతీ, పాతిమా, బోడెంపూడి రాజేశ్వరి, సత్తెనపల్లి నియోజక వర్గానికి చెందిన పలువురు తెలుగు మహిళా నాయకురాళ్ళు, అంగన్ వాడీ కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

కన్నాను సన్మానించిన ఆర్యవైశ్య నేతలు

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను గురువారం వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య నేతలు మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్.మధుసూదనరావు, ఎం.రమేష్, కే.సుబ్బారావు, ఏ.సుమన్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, ప్రసాదు, శ్రీనివాసరావు, రవి తదితరులు పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న సహాయక వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ

విత్తన దుకాణాల్లో తనిఖీ

కారంపూడి, జూన్ 13: పట్టణంలోని విత్తన దుకాణాలను గురువారం నరసరావుపేట సహాయక వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణంలోని స్టాక్, రికార్డులను పరిశీలించారు. అనంతరం మస్తానమ్మ మాట్లాడుతూ అధీకృత డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.అలాగే విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలన్నారు. తనిఖీలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళులు

సత్తెనపల్లి, జూన్ 13 : సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎం.పుల్లారావు అనారోగ్యంతో మరణించటంతో సమా చారం తెలుసుకున్న కన్నా తనయుడు, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు ఆయన గృహానికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పోలేపల్లిలో ఉచిత వైద్య శిబిరం

దుర్గి, జూన్ 13: మండలంలోని పోలేపల్లిలో గురువారం గుర్రం కృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా శ్రీకృష్ణ జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం రాజశేఖరరెడ్డి, పి మేరి, చల్లా లింగయ్య, మోహన్, నాగూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలలు

● రామాపురం పాఠశాల మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా ఎంపిక

ముప్పాళ్ళ జూన్ 13: మండలంలోని దమ్మాలపాడు గ్రామంలోని రామాపురం ప్రాథమిక పాఠశాలను మోడల్‌స్కూల్‌గా ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయుడు తోకల అచ్చయ్య గురువారం తెలిపారు. జిల్లాలో రెండు పాఠశాలలను మోడల్‌స్కూల్‌గా ఎంపిక చేయగా రామాపురం ప్రాథమిక పాఠశాల కూడా అందులో ఉందని తెలిపారు. పాఠశాల ప్రారంభంరోజున 'సంసిద్దతమేళా' కార్యాక్రమం నిర్వహించి ఒకటవ తరగతి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మువ్వా సురేష్, టీ.వేణు మాదవి, కళ్యాణి, సతీష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. వేసవి సెలవుల అనంతరం మండలంలోని అన్ని పాఠశాలలు గురువారం పునః ప్రారంబమయ్యాయని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు.

అచ్చంపేట : సెలవుల అనంతరం మండలంలోని అన్ని పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయని ఎంఈవో రావిపాటి నరసింహారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. రెండు మూడు రోజుల్లో పాఠ్య పుస్తకాలు అన్ని పాఠశాలలకు చేరనున్నట్లు ఎంఈవో తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నకరికల్లు జూన్ 13 : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన చల్లగుండ్ల శివారు పెట్రోల్‌బంకు సమీపంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేపల్లె మండలం బొబ్బర్లంకకు చెందిన పీట్రగడ్డ రవికుమార్(40), చల్లగుండ్ల పెట్రోల్ బంకు పక్కన గల ఒక మిల్క్ చిల్లింగ్ సెంటర్‌లో ఆపరేటరుగా పని చేస్తున్నాడు. ఉద్యోగ నిమిత్తమే అతను సంవత్సర కాలంగా ఇక్కడ పనిలో ఉన్నాడు. గురువారం పాల ట్యాంకర్ అక్కడకు రాగా పరీక్షల నిమిత్తం పాల శ్యాంపిల్ తీసేందుకు ట్యాంకర్‌పైకి ఎక్కాడు. ఆ సందర్భంలో ట్యాంకర్ పైన ఉన్న విద్యుత్ తీగను రవికుమార్ గమనించలేదు. దీంతో విద్యుత్ తీగ తగిలి రవికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని నరసరావుపేటలోని ఓ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. రవికుమార్‌ను పరీక్షిం చిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగేంద్రరావు కేసు నమోదు చేశారు.

హామీ ఫైళ్లపై సీఎం సంతకాలతో టీడీపీ నేతల హర్షం

క్రోసూరు, జూన్ 13 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఐదు సంక్షేమ కార్యక్రమాలపై సంతకాలు చేయటంతో క్రోసూరులోని పలువురు టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూల దండలు వేసి నివాళులర్పించారు. మెగా డీఎస్సీ, పింఛన్ రూ.4 వేలకు పెంపు, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, స్కిల్ గణన, అన్నక్యాంటీన్‌ల పునరుద్ధరణ ఫైళ్ళపై చంద్రబాబు ఒకేసారి సంతకాలు చేయటంతో నిరుద్యోగులు, నిరు పేదలు రైతులు, వృద్ధులు, విద్యార్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్‌లు కాంద్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు అన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఇచ్చిన హామీల అమలుకు చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, నలజాల కోటేశ్వరరావు, అనుముల వెంకట రామిరెడ్డి, దుద్దుల యోహాన్, నలజాల


ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద సంతోషం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

కోటేశ్వరరావు, మల్లాల రామాంజనేయులు, అనుమాల పూర్ణ, షేక్ ముస్తఫా, షేక్ హసాన్, బండారు మైసూరు బాబు, బండారు రామయ్య, ఏక్ మస్తాన్, ఆది శ్రీను, హనుమంతరావు, పిట్టల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇరు వర్గాల ఘర్షణ

● పరస్పరం కేసులు నమోదు చేసిన పోలీసులు

సత్తెనపల్లి రూరల్, జూన్ 13 : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనటంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడిన సంఘటన మండలంలోని రెంటపాళ్ళలో గురువారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారు రామకోటేశ్వరరావు తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన పల్లె సందీప్, కారుమంచి రాజేష్‌లు మరొక ద్విచక్ర వాహనంపై ఆ మార్గంలో వస్తున్నారు. ఈక్రమంలో ఇద్దరి ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. అనంతరం ఎవరి గృహాలకు వారు వెళ్ళారు. కొద్ది సేపటికి సందీప్, రాకేష్‌లు రామకోటేశ్వరరావు ఇంటికి వెళ్ళి తమ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి క్షమాపణ చెప్పకుండా వెళ్తావా? అంటూ నిలదీశారు. దీంతో వారి మధ్య వివాదం జరిగింది. అనంతరం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దాడిలో సందీప్, రాజేష్‌లతో పాటు బండారు కోటేశ్వర రావు, అతని కుమారుడు రవి, కోడలు ఏంజల్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను బంధువులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పరస్పర కేసులు నమోదు చేశారు. ఈ ఘటనలో రాజేష్ స్కూటీ దహనమైంది. స్కూటీని దహనం చేసిన వారెవరో వివరాలు తెలియ రాలేదని రూరల్ పోలీసులు తెలిపారు.



చౌటపాపాయపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

సీజనల్ వ్యాధుల నుంచి అప్రమత్తం

● మలేరియా పర్యవేక్షకులు జీవన వర ప్రసాదరావు

రాజుపాలెం,జూన్13: సీజనల్‌వ్యాధుల నుంచి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా పర్యవేక్షకులు ప్రత్తి జీవన వరప్రసాదరావు కోరారు. గురువారం మండలంలోని చౌటపాపాయ పాలెం గ్రామంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన వరప్రసాదరావు మాట్లాడుతూ దోమల వలన మలేరియా, డెంగీ, బోధకాలు, మెదడవాపు వంటి వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం అందరి బాధ్యత అన్నారు. అప్పుడే ఆయా వ్యాధులను నియంత్రించవచ్చని సూచించారు. కార్యక్రమంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ దేవానాయక్, మహిళ ఆరోగ్య కార్యకర్త ప్రమీలా బాయ్, హెల్త్ అసిస్టెంట్ సాదిక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన అవసరం

● రొమ్ము క్యాన్సర్ లక్షణాలను మహిళలకు వివరించండి

● పీహెచ్‌సీ వైద్యులకు, సిబ్బందికి డీఎం అండ్ హెచ్‌వో ఆదేశం

సత్తెనపల్లి, జూన్ 13: ఎన్నో సందర్భాల్లో అనేక మానసిక, శారీరక ఇబ్బందులకు గురవుతున్న మహిళలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో బీ.రవి ఆదేశించారు. గురువారం పట్టణంలోని ఏరియా వైద్యశాలలో క్యాన్సర్‌పై వివిధ పీహెచ్‌సీల డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరియా వైద్యశాల గైనకాలజిస్టు డాక్టర్ సుజాత రొమ్ము క్యాన్సర్ లక్షణాల గురించి వివరించారు. రొమ్ము కణజాలలో క్యాన్సర్ కణాలు అపవిత్రంగా పెరిగి పోవటం వలన ఈ వ్యాధి వస్తుందన్నారు. చిన్న చిన్న గడ్డల రూపంలో ఉండే ఈ క్యాన్సర్ కారణాలు ఇతర కణాలకు పాకి శరీరమంతా విస్తరించే అవకాశం ఉందన్నారు. రొమ్ము ఆకృతిలో మార్పు రావటం, చను మొన నుంచి ద్రవాలు రావటం, చన మొన ఆకృతిలో మార్పు వచ్చి కుశించుకు పోవటం, రొమ్ము మీద దురద రావటం, ఎర్రబారినట్టు ఉండటం వంటి లక్షణాలను రొమ్ము క్యాన్సర్‌గా గుర్తించాలన్నారు. ఇంకా వివిధ అంశాల గురించి ఆమె అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ అనుపమ వివిధ అంశాల గురించి తెలియ జేశారు. మహిళలు తమ ఆరోగ్యం పై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రొమ్ము క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి నయం చేయవచ్చని మహిళలకు తెలపాలన్నారు. పూర్తి స్థాయిలో వ్యాధిని నియంత్రించ వచ్చని, ఆహార నియమాలు పాటించాలని, సర్వైకల్ క్యాన్సర్ రాకుండా ముందస్తు వ్యాక్సిన్ వేయించుకోవాలని మహిళలకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో శోభారాణి, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మెగా డీఎస్సీపై చంద్రబాబు తొలి సంతకం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి



కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూన్ 13: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి 16,347 టీచర్ పోస్టులు భర్తీకి నిర్ణయం తీసుకోవడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం చేయడంతో రైతుల కళ్లలో ఆనందబాష్పాలు వస్తున్నాయన్నారు. పెన్షన్ రూ.4వేలకు పెంచుతూ మూడో సంతకం చేయడంతో అవ్వతాతలు మా పెద్ద కొడుకుగా నిండు నూరేళ్లు వర్ధిల్లాలి అంటూ దీవిసున్నారన్నారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై 4వ సంతకం చేయడంతో ఆర్ధాకలితో అలమటిస్తున్న నిరుపేదలు మా కడుపులు నింపుతున్న నువ్వు చల్లగా ఉండాలని దీవిస్తున్నారని చెప్పారు. నైపుణ్య గణనపై ఐదో సంతకంచేసి నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చారన్నారు.



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆరోగ్య మిత్ర యూనియన్ నాయకులు

ఆరోగ్యమిత్ర జీతాల పెంపుదల చేయరూ

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు యూనియన్ నాయకుల వినతి

నరసరావుపేట టౌన్, జూన్ 13: ఆరోగ్యమిత్ర క్యాడర్ జీతాల పెంపుదల సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ఆరోగ్యమిత్ర యూనియన్ నాయకులు కోరారు. గురువారం నరసరావుపేటలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జీతాల పెంపుదల ఫైల్ ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆగిపోయిందన్నారు. దీంతో స్పందించిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ తప్పకుండా ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, కార్యదర్శి అప్పారావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు సాయిబాబారాజు, వెంకటేశ్వర్లు, అశోక్, సుధాకర్, నాగేశ్వరరావు, పూర్ణ చంద్రరావు, దీనకుమారి తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్లాను, రవిని సన్మానిస్తున్న డైరెక్ట్ సేలింగ్ కంపెనీ ప్రతినిధులు

పరుగుల వీరుడు అబ్దుల్లాకు ఘన సన్మానం

వినుకొండ, జూన్ 13: పట్టణానికి చెందిన పరుగుల వీరుడు షేక్ అబ్దుల్లాను డైరెక్ట్ సేలింగ్ కంపెనీ ప్రతినిధులు గుంటూరులో ఘనంగా సన్మానించినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అబ్దుల్లా పరుగుల పోటీల్లో పాల్గొన్న ప్రతిచోట సునాయసంగా నిర్ణీత సమయంలో లక్ష్యాలను చేధించి జిల్లా, రాష్ట్ర, వివిధ దేశాల్లో పాల్గొని తన సత్తా చాటుతున్నారు. ఇతని గురించి తెలిసిన లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో అబ్దుల్లా పేరును నమోదు చేశారు. ఇది తెలుసుకున్న కంపెనీ ప్రతినిధులు గుంటూరులోని హోటల్‌లో డిజిటల్ సంపూర్ణ రామాయణం పుస్తకా విష్కరణలో భాగంగా అబ్దుల్లాను శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే కర్ణాటక రాష్ట్రం షికారిపుర మండలం కప్పనహల్లీ గ్రామానికి చెందిన పి.వై.రవి 20 సంవత్సరాల పాటు ఆర్మీలో సేవలు అందించి ప్రత్యేక గుర్తింపు సాధించారు. అబ్దుల్లాతో పాటు రవిని కూడా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్యే జీవీకి శుభాకాంక్షలు

వినుకొండ, జూన్ 13: పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు షేక్ జానీ కుటుంబం గురువారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్రంలో 164 అసెంబ్లీ స్థానాలు కూటమి సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా, వినుకొండలో 30 వేల పైచిలుకు ఓట్లతో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు భారీ మెజార్టీతో గెలిచిన సందర్భంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలో జానీ ఎన్నికల ప్రచారంలో పార్టీ గెలుపునకు కృషి చేశారు.

128వ రోజుకు చేరుకున్న అన్నదానం

బొల్లాపల్లి, జూన్ 13: ఎస్‌వీ చారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమం ఎన్నికల నేపథ్యంలో ఆగిపోయిన విషయం తెలిసిందే. కాగా మరలా ఎస్‌వీ చారిటీ అధినేత పోకా వెంకటరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని మరలా ప్రారంభించారు. ఈ ఛారిటీ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. తన జన్మదినం సందర్భంగా 128వ రోజు అన్నదానం చేస్తున్నామన్నారు. అలాగే కుల, మతాలకు అతీతంగా పేదవాడి ఆకలి తీర్చటం కోసం చేస్తున్న ఈ ప్రయత్నానికి మిత్రులు, శ్రేయోభిలాషులకు అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. ఇక ముందు కూడా ఈ అన్నదానం, విద్యా దానం, రక్తదానం కార్యక్రమాలు నిర్విరామంగా నడిపిస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు

ఏఐటీయూసీ ముఖ్యనాయకుల సమావేశం

వినుకొండ, జూన్ 13: పట్టణంలోని శివయ్యభవన్‌లో గురువారం ఏఐటీయూసీ నియోజకవర్గం ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికుల వ్యవస్థను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసి కార్మికులకు నెలనెల ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వకుండా సంవత్సరాల పాటు వేధించిందని, దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. అదేమని ప్రశ్నించిన కార్మికులను ఉద్యోగం నుంచి తీసివేస్తామని బెదిరించారని, గతంలో స్వచ్ఛభారత్ కార్మికుల వ్యవస్థను చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వీధులు పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ఏర్పాటు చేశారని, 680 జీవో ప్రకారం వారికి 10వేల జీతాన్ని కూడా కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌తో కలిపి ఇచ్చేవారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రూ.10వేల నుంచి రూ.6వేలకు తగ్గించి అవి కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని, మళ్లీ సీఎం చంద్రబాబు పాతపద్ధతిలోనే వారికి జీతాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఊట్ల రామారావు, పి.వెంకటేశ్వర్లు, కె.మల్లికార్జున, డి.మార్కు, మల్లేశ్వరరావు, దయామణి, సుందరరావు, జకర్యా, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాలయం తృతీయ వార్షికోత్సవం

రొంపిచర్ల, జూన్ 13: మండలంలోని సుబ్బయ్యపాలెం శివాలయం తృతీయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. గ్రామస్థులు అధికసంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం

ఎమ్మెల్యే ఆంజనేయులు





తిరుమలకు పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, కొచ్చెర్ల అంకాళ పరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జీవీ, మక్కెన

ఈపూరు, జూన్ 13: అన్ని సామాజికవర్గాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో తెలుగు యువత నాయకులు తిరుమల- తిరుపతికి చేపట్టిన పాదయాత్రను మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. ముందుగా గ్రామ దేవత కొచ్చెర్ల అంకాళ పరమేశ్వరి అమ్మవారికి ఆంజనేయులు, మక్కెన, జనసేన నాయకులు శ్రీనివాసరావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులందరికీ చేరేటట్లు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలోనే అత్యధిక మెజారిటీ తీసుకువచ్చిన కొచ్చెర్ల గ్రామ ప్రజలకు తానెప్పుడు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తిరుమలశెట్టి బాలయ్య, న్యాయవాది నలబోతు రామకోటేశ్వరరావు, ఐనాల కోటేశ్వరరావు, నెల్లూరి శాంతారావు, శీలం నరశింహారావు, నిశ్శంకర అంకారావు, పిచ్చయ్య, తూమాటి రామకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాలలకు విద్యార్థులు



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అసెంబ్లీ

నూజెండ్ల, జూన్ 13: వేసవి సెలవుల అనంతరం గురువారం ప్రారంభమైన పాఠశాలలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. మండలంలోని 78 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 24, 25వ విద్యా సంవత్సరం ప్రారంభమైనట్టు రెండో ఎంఈవో రవిచంద్ర తెలిపారు. మండలంలోని పాఠశాలల్లో 5,400మంది విద్యార్థులకు గాను మొదటి రోజు 2,850 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ప్రతి పాఠశాలకు అవసరమైన పాఠ్యపుస్తకాలను ముందుగానే పంపిణీ చేయటం జరిగిందని ఎంఈవో ఎస్ రవిచందర్ పేర్కొన్నారు. మండలంలోని 5 జడ్పీ, 3 ప్రాథమికోన్నత, 31 ప్రాథమిక పాఠశాలలు ఉండగా ప్రస్తుతం 2398మంది విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యార్థులకు అందజేసేందుకు ప్రభుత్వం 10,279 పాఠ్యపుస్తకాలు, 13496 నోటుపుస్తకాలు, 2398 బ్యాగులు, 2414జతల బూట్లు, 2414జతల సాక్సులను అందజేసిందన్నారు. విద్యాసామగ్రి కిట్లను అన్ని ప్రభుత్వ పాఠశాలలలోని హెచ్‌ఎంలు విద్యార్థులకు త్వరలో అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ బోయపాటి త్రివిక్రమ్, సీఆర్పీ ఎలికా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జగన్మోహన్‌రెడ్డి, పార్వతి, సురేష్ పాల్గొన్నారు.



నరసరావుపేట మండలం ఇసాప్పలెం ప్రభుత్వ హైస్కూలులో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

నరసరావుపేట రూరల్, జూన్ 13: వేసవి సెలవులు ముగిసిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం అయ్యాయి. నరసరావుపేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మొదటి రోజునే విద్యార్థులు పాఠశాలలకు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. మండలంలోని ఇసప్పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో 10వ తరగతి విద్యార్థులకు 27మందికి పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌పి మొహిద్దిన్, ఉపాధ్యాయులు బి.చంద్రశేఖర్, పి.జగన్నాధం, ఎ.శ్రీనివాసరావు, ఎ.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి కిట్లు అందజేత

శావల్యాపురం, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ప్రతిఏటా ప్రభుత్వం ఉచితంగా అందజేసే విద్యాసామగ్రి కిట్లను గురువారం అన్ని పాఠశాలలకు చేరవేసినట్లు ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు తెలిపారు. స్థానిక జడ్పీ పాఠశాలలో నిల్వఉంచిన విద్యాకానుక కిట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి జాప్యం లేకుండా అన్ని పాఠశాలలకు చేరేలా ప్రత్యేక పర్యవేక్షణ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ మండ



స్టాక్ రిజిస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు

మధ్యాహ్న భోజన పథకం స్టాక్ రిజిస్టర్ ఆవిష్కరణ

శావల్యాపురం, జూన్ 13: మధ్యాహ్న భోజనపథకం నిర్వహణలో ప్రభుత్వ పాఠశాలలలోని ప్రధానోపాధ్యాయుల పనిని సులభతరం చేయాలన్న సంకల్పంతో శావల్యాపురం ఎస్టీయూ శాఖవారి ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన ఎండీఎం స్టాక్ రిజిస్టర్లను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అందజేయనున్నట్లు ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రముట్ల వెంకటరత్నం తెలిపారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలు మద్దిగుంట్ల సాంబశివరావు, పుసులూరి లలితాకుమారిల చేతులమీదుగా ఉచిత ఎండీఎం స్టాక్ రిజిస్టర్‌లను గురువారం ఆవిష్కరించారు. ఎంఈవో సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనను అందించే సమయం వృథా కాకుండా ఉండేందుకు ఎస్టీయూ శాఖవారు వినూత్నంగా ఎండీఎం స్టాక్ రిజిస్టర్లను రూపొందించి అన్ని పాఠశాలలకు ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారికి తోడ్పాటును అందించడంలో ఎస్టీయూ ముందుంటుందని కొనియాడారు.

కార్యక్రమంలో ఎస్టీయూ మహిళా కన్వీనర్ నిర్మలాకుమారి, ఎస్టీయూ మండల అధ్యక్షుడు కంప శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బిళ్ళా రాజారమేష్, బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బీవీ నాగేశ్వరరావు, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయనీలు సువర్చల, అభిహా, హాలిమా, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



విద్యాసామగ్రిని పాఠశాలలకు పంపుతున్న ఎంఈవో సాంబశివరావు

చురుగ్గా లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణ పనులు



విప్పర్లపల్లిలో నిర్మాణంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం

రొంపిచర్ల, జూన్ 13: మండలంలోని విప్పర్లపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇక్కడ స్వామివారు స్వయంభూగా వెలిశారు. స్వామివారికి వెనుకవైపు లక్ష్మీదేవి అమ్మవారు కొలువై ఉన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.23లక్షల నిధులు మంజూరయ్యాయి. వీటిలో 1/4వ వంతు టీటీడీకి చెల్లించారు. గ్రామస్థుల సహాయ సహకారాలతో ఆలయ నిర్మాణ పనులను చేస్తున్నారు. సుమారు కోటి రూపాయల వ్యయంతో ఆలయ నిర్మాణం జరగనుంది.



ప్రత్యేక అలంకరణలో విప్పర్లలోని వల్లభేశ్వర స్వామి, పూజల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా వల్లభేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల, జూన్ 13: మండలంలోని విప్పర్లలోని గంగా పార్వతి సమేత నీల కంఠేశ్వరస్వామి ఆలయ 7వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. అర్చకులు చందలూరి పరమేశ్వరరావు స్వామివారికి పంచామృతాభిషేక పూజలను నిర్వహించారు. పార్వతిదేవి అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. ఆలయ ఆవరణలో జరిగిన యాగపూజలు, శివ పార్వతుల కల్యాణోత్సవంలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఆవరణలోని కామాక్షి అమ్మవారు, వినాయకుడు తదితర దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రత్యేక అలంకరణలోని స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

గ్రామీణాభివృద్ధికి నూతన ప్రభుత్వాలు కృషి చేయాలి

● ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి

నరసరావుపేట రూరల్, జూన్ 13: గ్రామీణ ప్రాంత అభివృద్ధికి నూతన ప్రభుత్వాలు కృషి చేయాలి అని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. నరసరావుపేట పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జాస్తి వీరాంజనేయులు పాల్గొని మాట్లాడుతూ ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగా ఈ రోజున పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపారు ఆంధ్రప్రదేశ్ కు గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి రావడం శుభ పరిణామం అన్నారు. గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామపంచాయతీ వ్యవస్థని, స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయడం జరిగిందన్నారు. నిధులు విధులు లేక కేంద్రం పంపిన ఆర్థిక సంఘం నిధులను కూడా విద్యుత్ బకాయిల పేరుతో ప్రభుత్వం చెల్లించుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వవలసిన ఐదో ఆర్థిక సంఘం నిధులు కూడా ఒక్క రూపాయి ఇవ్వకుండా స్థానిక సంస్థల ప్రతినిధులను జగన్ ప్రభుత్వం ఘోరంగా అవమానించిందన్నారు. అందుకే ప్రజలు ప్రభుత్వాన్ని సాగనంపడం జరిగిందన్నారు. ప్రస్తుతం డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గ్రామీణ అభివృద్ధికి నిధులను అదనంగా తీసుకువచ్చి గ్రామపంచాయతీ వ్యవస్థను బలోపేతం చేస్తారని ఆశా భావం వ్యక్తం చేశారు.

ఆస్ట్రేలియాలో సంబరాలు

నూజెండ్ల, జూన్ 13: మండలానికి చెందిన లగడపాటి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో గురువారం తెలుగుదేశం, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటుపై ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ మెల్‌బోర్న్ ప్రెసిడెంట్ లగడపాటి సుబ్బారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇక నుంచి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారనున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నంబాల గోపి, కొత్తూరు రాజీవ్, కొసరాజు రవి, నవీన్, భరత్, శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆస్ట్రేలియాలో సంబరాలు నిర్వహించుకుంటున్న లగడపాటి సుబ్బారావు, మిత్ర బృందం

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

● తొలుత ఆటో ఢీకొట్టడంతో రోడ్డుపైపడిన దంపతులు

● ఆపై వారిపై లారీ ఎక్కడంతో దుర్మరణం

మేదరమెట్ల, జూన్ 13: జాతీయ రహదారిపై తిమ్మనపాలెం వద్ద పాల ఆటో ఢీకొట్టి కిందపడిన దంపతులపై లారీ ఎక్కడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామానికి చెందిన బత్తుల కొండలు (49), బత్తుల లక్ష్మి (41) ఇంకొల్లు మండలం దుద్దుకూరులో ఉన్న కుమార్తె విజయలక్ష్మిని చూడడానికి గురువారం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నాగులుప్పలపాడులో తిమ్మనపాలెం వద్ద హైవే ఎక్కిన వీరి బైక్‌ను పాల ఆటో పక్కనే తగలడంతో ఇద్దరూ పడిపోయారు. అదే సమయంలో మేదరమెట్ల ప్రైవేట్ వెంచర్‌లో పార్కింగ్ టైల్స్ దించి గ్రోత్ సెంటర్ వైపు ఆపోజిట్ రోడ్డులో వస్తున్న లారీ వీరి శరీరాలపై నుంచి ఎక్కింది. దీంతో వారు అక్కడికి అక్కడే మృతి చెందారు. లారీ టైర్ల కిందపడి వారి మృతదేహాలు ఛిద్రమయ్యాయి. కొండలు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా చిన్న కూతురు వీరి వద్దనే ఉంది. దుద్దుకూరులో కొలుపులు చూడడానికి కూతురు వద్దకు వచ్చి మృతిచెందారని బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణరెడ్డి, కొరిశపాడు ఎస్ఐ శివయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పిడుగు పాటుకు మూడు మేకలు మృతి



ఈపూరు, జూన్ 13: మండలంలోని అగ్నిగుండాల సమీపంలో పిడుగుపాటుకు మూడు మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మాదంశెట్టి సాయిబాబా మేతకోసం మేకలను పొలం తోలుకుపోయాడు. గురువారం సాయంత్రం వర్షం కురుస్తుండటంతో మేకలు గుంపులుగా చెట్ల కిందకు చేరాయి. ఆ సమయంలో పక్కన పిడుగు పడటంతో మూడు మేకలు అక్కడిక్కడే మృతి చెందాయి.

చిలకలూరిపేటలో రూ.4 లక్షల చోరీ

చిలకలూరిపేట, జూన్ 13: పట్టణంలోని భాస్కర్ థియేటర్ సెంటర్‌లో ఉన్న విజయలక్ష్మి గాయత్రి జిరాక్స్ సెంటర్‌లో దొంగతనం జరిగింది. గుర్తు తెలియని దుండగులు తలుపులు, క్యాష్ కౌంటర్‌ను పగలగొట్టి అందులో ఉన్న రూ.4.02 లక్షల నగదును చోరీ చేశారు. అక్కడ వాచ్‌మెన్ ఉన్నప్పటికీ సమీపంలో అతను నిద్రిస్తున్నాడు. వాచ్‌మెన్ నిద్రలేచి తలుపులు తీసి ఉండటాన్ని గుర్తించి సంస్థ యజమానులకు విషయం తెలిపాడు. సంస్థ యజమాని తులసి వసంతరావు ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఒక చిట్ తాలూకు మొత్తాన్ని ఆఫీసులో ఉంచి వెళ్ళినట్టుగా ఫిర్యాదులో అతను తెలిపాడు. అర్బన్ సీఐ రమేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి అక్కడి ఆధారాలను సేకరించారు. పోలీసులు ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.



డాక్టర్ కోడెల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ తదితరులు

రాజకీయాల్లో స్ఫూర్తి డాక్టర్ కోడెల శివప్రసాదరావు

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, జూన్ 13: రాజకీయాలలో స్ఫూర్తి డాక్టర్ కోడెల శివప్రసాదరావు అని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గురువారం నరసరావుపేట పట్టణం కోటలో డాక్టర్ కోడెల శివరామకృష్ణను ఎంపీ కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడెల చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ చిన్నతనం నుంచి డాక్టర్ కోడెల శివప్రసాదరావును చూస్తూ పెరిగానన్నారు. ఆయనతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని డాక్టర్ కోడెల శివరామకృష్ణను కలిసి గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట షేక్ మస్తాన్ షరీఫ్, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.



రామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రిన్సిపాల్

వివిధ కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

● గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల, జూన్ 13: విద్యార్థుల ఉపాధి అవకాశాలకు ఉపయోగపడే కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉపాధ్యాయులు, అధ్యాపకులపై ఉందని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. మోడల్ పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బంది గ్రామాభివృద్ధికి కృషిచేస్తున్న రామిరెడ్డిని గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఝాన్సీరాణి 10వ తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ప్రాథమిక విద్య వరకు పాఠ్య పుస్తకాలను ఆంగ్ల, తెలుగు బాషల్లో ముద్రిస్తే బాగుంటుందన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్‌కు ఏ కోర్సును ఎంపిక చేసుకుంటే ఉపయోగం ఉంటుందో ఆలోచించే విధంగా సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అమెరికా, ఐరోపా వంటి దేశాల్లో విద్యా కౌన్సిలర్లు, విద్యార్థుల ప్రతిభ ఆసక్తిని గమనించి తదుపరి ఎలాంటి కోర్సులకు వెళ్ళాలనేది సూచనలు చేస్తారన్నారు. ఆయనతో పాటు ప్రవాస భారతీయుడు రామకృష్ణ, యన్నం శివారెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యాకానుక కిట్లను త్వరితగతిన పంపిణీ చేయాలి

● ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

యడ్లపాడు, జూన్ 13: విద్యాకానుక కిట్లను విద్యార్థులకు త్వరితగతిన పంపిణీ చేయాలని ఆర్జేడీ బి లింగేశ్వరరెడ్డి మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. మండల కేంద్రమైన యడ్లపాడులోని సెయింట్ ఆన్స్ పాఠశాలలోని విద్యాకానుక కిట్ల నిల్వ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. కేంద్రంలో నిల్వచేసిన పుస్తకాలు, బ్యాగులు తదితర విద్యాకానుక సామగ్రి నాణ్యతను పరిశీలించారు. కిట్ల పంపిణీకి తీసుకున్న చర్యలను ఎంఈవో నాగరత్నంను అడిగి తెలుసుకున్నారు. తొలిరోజైన గురువారం 10 ఉన్నత పాఠశాలలు, 4 ప్రాథమిక పాఠశాలలకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేసినట్లు ఎంఈవో తెలిపారు. విద్యాకానుక కిట్లపై పార్టీల గుర్తులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

నాదెండ్ల, జూన్ 13: మండలంలోని రైతులకు 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేయనున్నట్టు వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాదు తెలిపారు. జీలుగ విత్తనాలు 25 క్వింటాళ్ళు, జనుము 96 క్వింటాళ్ళు, పిల్లి పెసర 80 క్వింటాళ్ళ చొప్పున అందుబాటులో ఉన్నాయన్నారు. 50శాతం రాయితీ పోను జీలుగ పది కిలోల సంచి రూ.440, జనుము 440, పిల్లి పెసర ఎనిమిది కిలోల బస్తా రూ.536 చొప్పున రైతులు చెల్లించాలన్నారు. విత్తనాలు కావాల్సిన వారు గ్రామ సచివాలయాల పరిధిలోని వ్యవసాయ లేదా ఉద్యాన సహాయకులకు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకాలతో సంప్రదించాలన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు.